క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థులకు పత్రాలు అందజేస్తున్న శాంత

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల అంగన్‌వాడీ కేంద్రంలో ఐదు సంవత్సరాలు పూర్తిచేసకున్న విద్యార్థులకు ఐసీడీసీ సూపర్‌వైజర్ శాంత ఆధ్వర్యంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే గురువారం నిర్వహించారు. విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మైమున్నిసా, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంగవీటిరంగ జయంతి


వృద్ధా శ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: రాష్ట్ర కాపు సంఘం నాయకులు వంగవీటి మోహన రంగ 77వ జయంతి వేడుకలను మండల బలిజ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో వైద్యులు చరణ్ రాజు, స్వప్న ప్రియ చేతుల మీదుగా రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధా ఆశ్రమం, అన్నపూర్ణ అనాథ ఆశ్రమంలో చిన్నారులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం బలిజ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, పాత బస్టాండులో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారెడ్డి, హరి, పవన్, నారాయణ,నాగ మోహన్, నాగేశ్వర రావు, వంశీ, అంజి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

బేతంచెర్ల: బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాధమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొలుముల పల్లె అంగన్‌వాడీ కేంద్రంలో బైటి బచావో-బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామస్తులు, చిన్నారుల తల్లులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్త్రీ, పురుషుల మధ్య లింగ వివక్ష లేకుండా ఉండకూడదని, సమానంగా చూడలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, మాధవి, సుమలత, భారతి, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

వలంటీర్ల నుంచి మొబైల్ ఫోన్లు స్వాధీనం

ప్యాపిలి: రాజీనామా చేసిన వలంటీర్ల నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు మొబైల్ ఫోన్లు, వేలిముద్రల పరికరాలు, సిమ్ కార్డు స్వాధీనం చేసుకుంటున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ గురువారం తెలిపారు. పింఛన్ల పంపిణీ కోసం గతంలో ప్రభుత్వం వలంటీర్లకు ఈ పరికరాలను పంపిణీ చేసిందన్నారు. అయితే కొన్ని కారణాల నేపథ్యంలో మండలంలో మొత్తం 134 మంది రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఇప్పటికే 129 మంది తమ వద్ద ఉన్న మొబైల్ ఇతర డివైస్‌లు స్వాధీనపరిచారని తెలిపారు. మరో ఐదుగురు మాత్రమే ఇవ్వాల్సి ఉందన్నారు.

కౌలుకార్డులు తీసుకోవాలి

సంజామల: కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని ఏఓ సుధాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలాలను కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న రైతులు వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి కౌలు కార్డులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ సూచించారు. కౌలు కార్డుల కోసం భూయజమాని ఆధార్ కార్డు, పొలం పాస్‌పుస్తకం , కౌలు రైతు ఆధార్ కార్డు, అగ్రిమెంట్, పాస్ ఫొటోతో అధికారులను సంప్రదించాలని సూచించారు.

21న మయసభ ఏకపాత్రాభినయం పోటీలు

కొలిమిగుండ్ల: స్థానిక షిర్డీసాయి బాబా ఆలయంలో 21న గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా మయ సభ ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తున్నట్లు షిర్డీసాయి సేవా ట్రస్ట్ చైర్మన్ వీడీ రాజగోపాల్ గురువారం ప్రకటనలో తెలిపారు. పౌరాణిక నాటక కళాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు ఏర్పాటు చేశామన్నారు. 15 నిమిషాలలో దుర్యోధుని వేషధారణలో ఏకపాత్రాభినయాన్ని ప్రదర్శించాలన్నారు. ముగ్గురికి రూ.5వేలు, రూ.3వేలు, రూ. 2వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఆర్‌టీఓగా తిమ్మరసు నాయుడు


ఆర్‌టీఓను సత్కరిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

డోన్ రూరల్ : డోన్ ఆర్‌టీఓగా తిమ్మరసు నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు. అలాగే ఆటో యూనియన్ నాయకులు ఆర్‌టీఓకు శాలువాలు కప్పి పూలదండలతో సత్కరించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

డోన్ టౌన్ : కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ విద్యారంగ పరిరక్షణకు గురువారం విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ప్రైవేట్ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించగా ప్రభుత్వ పాఠశాలలను నాయకులు బంద్ చేయించారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ, ఎన్ఎస్ఐ తదితర సంఘాల నాయకుల విద్యార్థులతో కలిసి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కొత్తబస్టాండ్ కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. పాత బస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు అశోక్, పవన్, విజయ్, నక్కి హరి, సూర్యప్రతాప్, మధు తదితరులు మాట్లాడారు. నీట్ పరీక్ష లీక్‌పై సమగ్ర విచారణ జరిపించి బాధితులపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్‌పై నిందితులు అంగీకరించినా కేంద్రం మౌనంగా ఉండడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి, విష్ణు, తేజ, నవీన్, మహబూబ్‌బాషా, మహేంద్ర, రాము, సురేస్, సోమనాథ్‌రెడ్డి, శివకాంత్, మదన్‌గోపాల్, పవన్, రాజశేఖర్, ధర్మతేజ, కార్తీక్, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.



డోన్: కొత్తబస్టాండ్ రోడ్డులో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

బేతంచెర్ల: విద్యారంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ విమర్శించారు. దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌లో భాగంగా మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను నాయకులు బంద్ చేయించారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కుదిపేస్తున్న నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ప్రదీప్, భాస్కర్, నాయకులు శివ, గణేష్, వెంకటచారి, నంది, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: నీట్ పరీక్షాపత్రం లీక్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను ఏఐఎస్ఎఫ్ నాయకులు బంద్ చేయించారు. ఈ సందర్భంగా వారు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివకేశవ మాట్లాడుతూ నీట్ అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐవైఎఫ్ మండల కన్వీనర్ శివప్రసాద్, సుమన్, సాయితేజ, రాహుల్, యశ్వంత్, రవి, జగదీశ్, లోక్‌నాథ్ రెడ్డి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.


డోన్: నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థినులు


డోన్: బాలుర ఉన్నత పాఠశాలను బంద్ చేయిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు


బేతంచెర్ల: నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బంద్ ప్రశాంతం


కోవెలకుంట్ల: బంద్ నిర్వహిస్తున్న నాయకులు

కోవెలకుంట్ల: నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన దేశవ్యాప్త బంద్ విజయవంతమైంది. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలను మూసివేసి బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు మాబు ఉసేన్ మాట్లాడుతూ నీట్ పరీక్షలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు బాబు, యశ్వంత్, సూరిబాబు, విక్రమ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : మండలంలో విద్యాసంస్థ బంద్ విజయవంతమైంది. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి మాట్లాడుతూ నీటి పేపర్ లికేజీపై పార్లమెంట్ సమావేశాల్లో స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రధాన మంత్రి స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఉస్మాన్, నాగార్జున, శివ సతీష్‌కుమార్, మనోజ్‌కుమార్, అనిల్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


బనగానపల్లె: నిరసన తెలుపుతున్న నాయకులు

బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలి


వృద్ధురాలికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

బనగానపల్లె రూరల్ : వయోవృద్ధులు తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్ వేయించు కోవాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు తెలిపారు. గురువారం పట్టణంలోని తెలుగుపేటలో బీసీజీ వ్యాక్సినేషన్, డయోరీయా వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ బీసీజీ టీకా వేయించుకోవడం వల్ల టీబీ, ఇన్ఫెక్షన్ వంటి జబ్బులు రాకుండా నివారించు కోవచ్చన్నారు. అలాగే అతిసారా తదితర సీజనల్ వ్యాధులను సోకిన పిల్లలను ఆరోగ్య సిబ్బంది గుర్తించి నివారణ చర్యల తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణి, బాలింత మహిళలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఎన్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ అయ్యమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ రమేష్,ఏఎన్ఎం గ్రేసమ్మ ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: అరవైఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి టీబీ సోకకుండా బీసీజీ టీకా వేసే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతున్నట్లు డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభాని తెలిపారు. గురువారం కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని సొదరదిన్నె, బిజనవేముల గ్రామాల్లో వృద్ధులకు బీసీజీ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, హెల్త్‌సూపర్‌వైజర్ ప్రభావతి, ఏఎన్ఎం ఉస్మా, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

బేతంచెర్ల: కస్తూర్బా విద్యార్థినులు ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేయాలని డోన్ ఆర్డీఓ మహేశ్వర్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణానికి సమీపాన బగానపల్లె రహదారిలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాన్ని డోన్ ఆర్డీఓ మహేశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల హాజరు, బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవన్ చంద్ర శేఖర్, ఎంఈఓ సోమశేఖర్, ప్రిన్సిపాల్ అబిదా బేగం పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

సామాజిక తనిఖీ బహిరంగ సభ

డోన్ రూరల్: పట్టణంలోని జాడీలఫ్యాక్టరీలో గురువారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సమాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, పీడీ రామచంద్రారెడ్డి, ఏపీడీ పర్వీన్‌బేగం హాజరయ్యారు. పీడీ మాట్లాడుతూ మండలంలో అక్రమాలకు పాల్పడిన వారికి మొత్తం రూ.2,75,109 జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ సుకుర్, ఏఈలు నారాయణ, సతీస్, టీఏ శ్రీనివాసరాజ్, మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలకు విద్యార్థిని ఎంపిక


గుర్కా రేవతి

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలోని ప్రకృతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన గుర్కా రేవతి నవోదయ పాఠశాలకు ఎంపికయ్యిందని పాఠశాల కరస్పాండెంట్ నర్ల రవి కుమార్ రెడ్డి గురువారం తెలిపారు. 2024 జనవరిలో నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ పరీక్షలో 90 మార్కులు సాధించి నవోదయ పాఠశాలకు ఎంపికయ్యిందన్నారు. విద్యార్థినిని కరస్పాండెంట్ రవి కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు మహేష్, ప్రసాద్‌రెడ్డి, శిరీష, శంకర్ రెడ్డి అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

బనగానపల్లెరూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని బీరవోలు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ గురువారం తెలిపారు. బోయ సుదర్శన్, సుమంత్ తనను అనవసరంగా కులంపేరుతో దూషించడంతోపాటు దాడికి పాల్పడ్డారని ఆ గ్రామానికి చెందిన సుబ్బరాయుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో నంద్యాలకు చెందిన శాంతిరాం ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్య శిబిరాన్ని ఈఓపీఆర్‌డీ రాధిక, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరంలో డాక్టర్ మంజస్‌షావలి ఆధ్వర్యంలో ప్రజలకు బీపీ, షుగర్, ఈసీజీ, టుడీఎకో తదితర వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చే శారు. కార్యక్రమంలో ఈఓ గోపినాథ్, ఆసుపత్రి మేనేజర్ రవిబాబు పాల్గొన్నారు.

అల్లూరి ఆశయాల సాధనకు కృషి చేయాలి


అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు


పాతపేట హైస్కూల్లో సీతారామరాజు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల: స్వాతంత్ర సమర యోధుడు, తెలుగుజాతి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. కోవెలకుంట్ల పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీకళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అల్లూరి 127వ జయంతి, భారత ఆధ్యాత్మికవేత్త స్వామి వివేకానంద 121వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి, స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, కొలిమిగుండ్ల ఎంఈఓ, కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజయ్య మాట్లాడారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధింప చేసేందుకు విప్లవ మార్గాన్ని ఎంచుకుని ప్రాణాలర్పించిన విప్లవ జ్యోతి అల్లూరి అని కొనియాడారు. అలాగే స్వామి వివేకానంద బోధనలు, ఆధ్యాత్మికతను విద్యార్థులకు ఈ సందర్భంగా వారు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజు, రాజశేఖర్, లక్ష్మిదేవి, ఉపాధ్యాయులు నాగేశుడు, మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, సురేష్‌రెడ్డి, సుగుణ, వెంకటరమేష్, సుధీర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జయంతి

డోన్ టౌన్ : విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతిని పురష్కరించుకుని గురువారం పాతపేట జెడ్పీ హైస్కూల్లో ఆయన చిత్ర పటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి త్యాగాలను హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, బాబు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, వెంకటలక్ష్మి, రాధ, శ్రీనివాసులు, అల్లిపీరా, లీలావతమ్మ, ఆదినారాయణ, దేవేంద్రప్ప, లక్ష్మీప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

తారకరామనగర్‌లో...

సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ ఆధ్వర్యంలో స్థానిక తారకరామనగర్‌లో అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి జీవిత చరిత్రను మమ్మద్ రఫీ కాలనీవాసులకు వివరించారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో...

స్థానిక భవానీ హాస్టల్ వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి త్యాగాలను ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రవిశేఖర్ గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు అభినాష్, జగదీష్, లోకేష్, సోమనాథ్, రాజు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీనపాటి, లెక్చరర్లు రామకృష్ణయ్య, నవీన్, ఓబులేసు, వెంకటరమణ, మద్దిలేటి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాయకులను స్మరించుకోవాలి

బేతంచెర్ల: స్వాతంత్ర్య ఉద్యమంలో దేశం కోసం పోరాడిన నాయకులను స్మరించుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి, పింగళి వెంకటయ్య, దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బేతంచెర్ల: పట్టణంలోని వికాస నిలయంలో వికాస భారతి గౌరవ అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద వర్ధంతి, అల్లూరి సీతారామ రాజు జయంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి బీవీ నాగేంద్ర ప్రసాద్, సభ్యులు మారుతి కృష్ణ, చంద్ర మౌలీ శ్వర్ రెడ్డి, మధు మోహన్ రెడ్డి, నాగమోహన్, బూషిరెడ్డి పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో సోమవారం నిర్వహించాల్సిన వారంతపు సంత వేలం పాటను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు పంచాయితీ కార్యదర్శి భాస్కర్‌రావు గురువారం తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంత గడువు ముగియడంతో వేలం నిర్వహించాలని ఏర్పాట్లు చేశామన్నారు. రద్దు చేయాల్సి వచ్చిందని, ఎప్పుడు నిర్వహించేది తెలుపుతామన్నారు.

పొలాన్ని కబ్జా చేశారు... న్యాయం చేయండి

ప్యాపిలి: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో తనకు చెందిన 1.17 ఎకరాల భూమిని కబ్జా చేసి తిరిగి బెదిరింపులకు పాల్పడుతున్నారని మహేశ్వరయ్య గురువారం విలేకరుల ఎదుట వాపోయాడు. 725-1 సర్వే నంబర్‌లో తనకు 4.2 ఎకరాల భూమి ఉందన్నాడు. అయితే ఈ భూమిలో 1.17 ఎకరాల భూమిని కబ్జాచేసిన మాధవరం గ్రామానికి చెందిన పెద్దపాయి మురళీ, చంద్ర, శ్రీరాములు, నరేశ్, నరసింహుడు తదితరులు బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశాడు. వివాదంలో ఉన్న ఈ భూమి విషయంలో కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నప్పటికీ తనను బెదిరిస్తున్నారని తెలిపాడు. తనకు న్యాయం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు మహేశ్వరయ్య తెలిపాడు.

కోలుకోలేక మహిళ మృతి

బేతంచెర్ల: పట్టణంలోని కొత్తపేట కాలనీకి చెందిన కొమ్ము రమాదేవి (30) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి గురువారం తెలిపారు. ఆమె బుధవారం రాత్రి వాస్మోల్ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి లూర్దమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బీవీ సుబ్బారెడ్డి సేవలు చిరస్మరణీయం

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన దివంగత బీవీ సుబ్బారెడ్డి రేనాటిగడ్డ ఖ్యాతిని దేశ నలుమూలలా చాటారని కోవెలకుంట్ల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బీవీ ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. బీవీ సుబ్బారెడ్డి 121వ జయంతిని పురష్కరించుకుని గురువారం స్థానిక గ్రామ పంచాయతీ పక్కన ఉన్న పార్కులో బీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా బీవీ పదవులకు వన్నె తెచ్చారన్నారు. కోవెలకుంట్ల నియోజకవర్గానికి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉపముఖ్యమంత్రిగా, పది సంవత్సరాల పాటు స్పీకర్‌గా పనిచేశారన్నారు. అలాగే ప్రకృతి పీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బీవీ సుబ్బారెడ్డి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం రామకృష్ణారెడ్డి, బీవీ సూర్యప్రకాష్‌రెడ్డి, భాస్కర్, కసిరెడ్డి రఘునాథరెడ్డి, పుల్లయ్య, ఆకుమల్ల పుల్లారెడ్డి, తేజ స్టూడియో నిర్వాహకుడు కొంకా వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.


బీవీ సుబ్బారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

దస్తగిరిస్వామి దర్గాలో ప్రత్యేక పూజలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం లోని దస్తగిరి స్వామి దర్గాలో గురువారం ప్రత్యేక ఫాతెహాల్ నిర్వహించారు. గ్రామానికి చెందిన వడ్డె నాగన్న కుటుంబ సభ్యులు దర్గాకు తమ సొంత నిధులతో మ రమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా అన్నదా నం చేశారు. మంత్రి ఎస్ఎండీ ఫరూఖ్ కుమారుడు ఎస్ఎండీ ఫెరోజ్ ఫాతెహాల్ సమర్పించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల, నొస్సం గ్రామాలలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ రమేష్ రెడ్డి సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఆకుమల్ల గ్రామానికి చెందిన తొమ్మిది మంది పేకాటరాయుళ్ల నుంచి రూ.12300, నొస్సం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.4,800 స్వాధీనం చేసుకుని గురువారం కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

భాష్యం స్కూల్‌పై ఫిర్యాదు

డోన్ టౌన్ : పట్టణంలో నూతనంగా ప్రారంభించిన భాష్యం స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రం నంద్యాలలో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చాడేశ్వరిదేవికి ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న భవనంలో పాఠశాలను ప్రారంభించడం సరైంది కాదన్నారు. మండల స్థాయి విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు తనిఖీలు నిర్వహించి స్కూల్‌ను సీజ్ చేసినప్పటికీ తరగతులను నిర్వహిస్తున్నారని ఆరోపించారు.


చాడేశ్వరికి వినతి పత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్

ఘనంగా శివపార్వతుల కల్యాణం

బనగానపల్లె రూరల్ : ప్రముఖశైవ క్షేత్రం యాగంటిలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాసశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ఏకశిలారూపంలో కొలువైన ఉమామహేశ్వరస్వామికి అభిషేకం అర్చన తదితర పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను వధూవరులుగా అలంకరించి కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదం పంపిణి చేశారు.


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

నవధాన్యాల పంటలు ఉపయోగకరం

అవుకు: ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలు వేస్తే నేలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఏఓ అబ్దుల్ హక్ తెలిపారు. మండల పరిధిలోని శింగనపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాన్ని గురువారం ఏఓ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ముందు పొడి విత్తనాలు చల్లే పద్ధతిలో భాగంగా నవధాన్యాలైన రాగులు, కొర్ర, జొన్న, మొక్కజొన్న, మినుము, ధనియాలు, పెసర, మెంతులు, శనగ వంటి విత్తనాలను చల్లడం ద్వారా భూమిలో సేంద్రియ కార్బన శాతం పెరుగుతుందన్నారు. అంతేకాకుండా పశువులకు పచ్చిగడ్డి మేతగా ఉపయోగపడతాని తెలిపారు. అనంతరం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యానవన సహాయకుడు బాషా, సేంద్రీయ వ్యవసాయ బృందం గ్రామ రైతులు పాల్గొన్నారు.


పంటల సాగును వివరిస్తున్న ఏఓ అబ్దుల్ హక్

వ్యక్తిపై కేసు నమోదు

అవుకు: మండల కేంద్రం అవుకు పట్టణానికి చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ గురువారం తెలిపారు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. కుమ్మరిదిడ్డి వీధిలో ఒకే కుటుంబానికి చెందిన ఎం. రంగనాథ్, ఎం.రవికృష్ణ గొడవ పడ్డారు. రవికృష్ణ తాగుడుకు బానిసై చెడు తిరుగుళ్లు తిరుగుతూ, చిల్లర గొడవలు చేస్తుంటే రంగనాథ్ మందలించాడు. దీంతో ఆగ్రహించిన రవికృష్ణ బీరు బాటిల్ ముక్కతో రంగనాథ్ గొంతులో పొడిచాడు. అతన్ని చికిత్స నిమిత్తం వెంటనే నంద్యాల ఆసుపత్రికి తరలించారు. తల్లి మహలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.